


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 09-06-2026 | సంపుటి - 29 | సంచిక -13 | రూ : 4 | పేజీలు: 8


## నేడు పరేడ్ మైదానంలో
# మహిళాశక్తి మహాసభ

- రూ.500 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ
- మంత్రులు సీతక్క, పొన్నం వెల్లడి

హైదరాబాద్: ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో భారీఎత్తున మహిళాశక్తి సభను నిర్వహిస్తున్నట్లు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తెలిపారు. సభ నిర్వహణపై సోమవారం సచివాలయంలో వారు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు దానకిశోర్, వికాస్‌రాజ్, నవీన్ మిత్తల్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్ పాల్గొన్నారు. మంత్రులు మాట్లాడుతూ.. 'గత రెండేళ్లుగా ఉపాధి అవకాశాల విస్తరణ, వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి, ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ తదితర పథకాల ద్వారా మహిళా సాధికారతకు తరువాయి 2లో






# ఎవరేం చేశారో చర్చిద్దాం.. అసెంబ్లీకి రండి

- కేసీఆర్, భాజపా నేతలకు మియాపూర్ సభలో సీఎం సవాల్
- గుజరాత్ గులాములంటూ ప్రతిపక్ష ఎంపీలపై విమర్శలు
- నగరాభివృద్ధికి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని ఆరోపణ

2లో





## 'నైరుతి'
# పలకరింత..

- నేడు, రేపు రాష్ట్రమంతటా విస్తరణ
- 14 వరకు అక్కడక్కడ తేలికపాటి వానలు

హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. సోమవారం రాష్ట్ర దక్షిణ సరిహద్దు జిల్లా జోగులాంబ గద్వాలను తాకాయి. వచ్చే రెండు రోజుల్లో రాష్ట్రమంతటా రుతుపవనాలు విస్తరించనున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది. మరోవైపు ఉత్తర్‌ప్రదేశ్ నుంచి తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు ఒక ద్రోణి కొనసాగుతోంది. తరువాయి 2లో

# ఉక్కులో ఉపద్రవం

- విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం
- భారీ పేలుడుతో ఎగసిపడిన 150 టన్నుల ఉక్కు ద్రావణం
- 8 మంది కార్మికుల దుర్మరణం
- మరో ఆరుగురికి తీవ్ర గాయాలు
- 1,540 డిగ్రీల వేడితో ఉన్న ద్రవ ఉక్కు పడటంతో బొగ్గుల్లా మారిన మృతదేహాలు

2లో



## నెహ్రూను అధిగమించనున్న
# ప్రధాని మోదీ



- ఎన్నికైన ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం పాలించిన ఘనత
- రేపటితో ఆయన ఖాతాలో చేరనున్న రికార్డు

నెహ్రూ 1947 నుంచి 1964 వరకు ప్రధానిగా మొత్తం 6,130 రోజులు పని చేశారు. అయితే 1947 ఆగస్టు 15న తరువాయి 2లో





## 'మినరల్ పవర్'గా
# భారత్‌ను అభివృద్ధి చేస్తాం!

- 2028లో అధికారంలోకి వస్తాం.. సింగరేణి ఉద్యోగులకు ఐటీ చెల్లింపులు రీయింబర్స్ చేస్తాం
- డీఎంఎఫ్ నిధుల్ని దారి మళ్లించిన భారాస, కాంగ్రెస్ ప్రభుత్వాలు
- క్రిటికల్ మినరల్ల నుంచి కోల్ గ్యాసిఫికేషన్ వరకు భారీ ప్రణాళికలు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

2లో

## ఫిలిప్పీన్స్‌లో
# భారీ భూకంపం

- రిక్టర్ స్కేల్ పై 7.8 తీవ్రత..32 మందికి పైగా మృతి
- మూడు అడుగుల మేర సునామీ అలలు
- పలు ప్రాంతాల్లో నిలిచిన విద్యుత్ సరఫరా
- ఇండోనేషియా, మలేషియా తీరాలకూ సునామీ ముప్పు

మనీలా : ఫిలిప్పీన్స్‌లో సోమవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. దేశ దక్షిణ భాగంలోని మిండానో ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 7.8 తీవ్రతతో భూమి కంపించింది. దీంతో ఫిలిప్పిన్స్ తీరంలో మూడడుగుల ఎత్తు వరకు తరువాయి 2లో






## అఖిలపక్షం
# ఏర్పాటు చేయండి

- ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, ధరల పెరుగుదలపై చర్చించాలి
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- 'సర్'పై సీజేఐకి లేఖ
- రాయాలి : ఢిల్లీలో జరిగిన ఇండియా బ్లాక్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- ఆగస్టులో హైదరాబాద్‌లో తదుపరి సమావేశం

2లో

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ప్రజలపై కేంద్రం పెను భారం

**:- ఎండి జహంగీర్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో మోదీ సర్కార్ దేశ ప్రజల పెనుభారం మోపుతుందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి జహంగీర్ ఆరోపించారు. చౌటుప్పల్ మండల జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎండీ జహంగీర్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే డీజిల్, పెట్రోల్ గ్యాస్ ధరలను పెంచి ప్రజలను మరోసారి మోసం చేసిందన్నారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరల పెరుగుదల వల్ల అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందన్నారు. ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమేనని విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలు, నెల గడపకముందే మర్చిపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, రాగీరు కిష్టయ్య, గడ్డం వెంకటేశం, మండల నాయకులు బోయ యాదయ్య, పొట్ట శ్రీనివాస్, బోదాసు వెంకటేశం, కొండే శ్రీశైలం, కొంతం సుశీల, చెరుకు లక్ష్మమ్మ, చీరిక అలివేలు, పగిళ్ల శశిరేఖ, యాట బాలరాజు, శాఖ కార్యదర్శులు రత్నం శ్రీకాంత్, కొంతం శ్రీనివాస్ రెడ్డి, నేరేడు మహేష్, జక్కిడి రమణారెడ్డి, మానే సాలయ్య, పల్లె సత్యం, బోదాస్ స్వాతి, ఉప సర్పంచ్ వార్డు మెంబర్ పాలమాకుల పుష్ప, నక్క జయసుధ, జంగం వెంకటమ్మ, సంజీవ రమేష్, పార్టీ నాయకులు యాట ముత్యాలు, రమేష్ జంగం అంజయ్య, ఫకీర్ పెంటారెడ్డి, చెరుకు అంజయ్య, ఎస్.కె మదార్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## రైతు ప్రభుత్వం.. కాంగ్రెస్ ప్రభుత్వం

- **ధర్మోజి గూడెంలో ధాన్యం నిల్వ కోసం గోదాం ప్రారంభం**
- **చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటూ.. అండదండగా ఉంటున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ధాన్యం నిల్వ కోసం నూతన గోదాంను సర్పంచ్ జువ్వి నర్సింహ్మతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని చివరి ధాన్యపు గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా నూతన గోదామును ప్రారంభించామన్నారు. ఈ గోదాం సామర్థ్యం దాదాపు లక్ష ధాన్యం బస్తాలు వరకు ఉంటుందన్నారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, ఐతరాజు లింగస్వామి, ఊదరి స్వామి, ఐతరాజు శివ, ఏపీఎం యాదయ్య, జీపీవో గాలయ్య, బద్రి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ వైస్ చైర్మన్ గా పెద్ద ఉపేందర్ గుప్తా



ప్రజాస్ఫూర్తి, రఘునాథ్ పల్లి: ఆర్యవైశ్య మహాసభ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ వైస్ చైర్మన్ గా రఘునాథ్ పల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కూరెళ్ల పెద్ద ఉపేందర్ గుప్తను నియమిస్తూ సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు లక్ష్మీనారాయణ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ గుప్త మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ను మరింత బలపేతం చేస్తూ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సంఘాన్ని మరింత బలపేతం చేస్తానని ఆయన వివరించారు తనకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాలో విద్యాశాఖ అండతోనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు

- **అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు**
- **ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి చిన్న బాబు, ఎండీ. అన్వర్**




మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : మేడ్చల్ జిల్లాలో, ప్రైవేట్ పాఠశాలల వారు విద్యా వ్యాపారం చేస్తూ అక్షరాలతో లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారని మేడ్చల్ జిల్లాలో బీటెక్ ఫీజుల కంటే ఎల్ కే జి ఫీజులే ఎక్కువగా ఉన్నాయని, అడ్మిషన్ ఫీజు పేరుతో అయిదు వేల 20,00వేల వరకు వసూలు చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్, వరల్డ్ అని హోర్డింగ్స్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్న ఎందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికే అనేక పాఠశాలలో పాఠశాలల ఆవరణలోనే వచ్చే విద్యాసంవత్సరం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతున్నారని, ఫీజుల నియంత్రణ లేదని మౌలిక వసతుల కల్పనలేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారులే వత్తాసు పలుకుతున్నారు మేడ్చల్ జిల్లా లో నిబంధన విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహణలో ఉన్న, ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని అనుమతి లేని పాఠశాల పేర్లు బహిర్గతం చేయాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ ఛాంబర్ ముట్టడిస్తామని, ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, చిన్న బాబు ,ఎండీ. అన్వర్ హెచ్చరించారు.

## ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు విజయలక్ష్మి మృతి



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) కమిటీ సభ్యురాలు కొలిపాక విజయలక్ష్మి (61) ఆదివారం రాత్రి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మరణవార్త తెలుసుకున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎన్. సృజనతో పాటు సీపీఎం నాయకులు చింతల యాదయ్య, కర్రె జంగయ్య, శైలజ తదితరులు మృతదేహానికి ఎర్ర జెండా కప్పి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో భూపాలపల్లి అభివృద్ధి నిలిచిపోయింది

- **గండ్ర వెంకట రమణారెడ్డి**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా భూపాలపల్లి పట్టణం, జిల్లా అభివృద్ధి విషయంలో ఎలాంటి పురోగతి కనిపించలేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత అభివృద్ధికే పరిమితమయ్యారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంజూరు చేయించిన అనేక అభివృద్ధి పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, కొత్తగా నిధులు తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అంబేద్కర్ సెంటర్-2 ఇంక్లైన్, అంబేద్కర్ సెంటర్-కృష్ణాకాలనీ రహదారుల అభివృద్ధికి మంజూరైన నిధులను ఇతర ప్రాంతాలకు మళ్లించారని ఆరోపించారు. హైడ్రా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం

- **గ్రామసభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హామీ**




చిట్యాల, ప్రజాస్ఫూర్తి: ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే గుర్తించి పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం చిట్యాల మండలంలోని అందుకు తండలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సరఫరా, రహదారులు, సైడ్ డ్రైన్ల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. మహిళా సంఘ భవనం, అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించి మంజూరు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఎమ్మెల్యే, పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమి సారం తగ్గుతుందని పేర్కొన్నారు. అవశేషాలను సేంద్రియ ఎరువులుగా వినియోగించడం ద్వారా నేల సారవంతం పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయాలకు చెక్ ఇంటర్‌లింక్ వ్యవస్థతో నిరంతరాయ సరఫరా

- **ఆసిఫాబాద్ ఎస్ఈ ఉత్తమ్ జాడే**




ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా జిల్లాలో ఆధునిక ఇంటర్‌లింక్ లైన్ (అనుసంధాన) వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) ఉత్తమ్ జాడే ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా గాలివానలు, వరదలు, సాంకేతిక లోపాలు లేదా అత్యవసర మరమ్మతుల వల్ల ఒక లైన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఆ పరిధిలోని వినియోగదారులంతా ఇబ్బంది పడాల్సి వస్తుందని, కానీ ఈ సరికొత్త ఇంటర్‌లింక్ వ్యవస్థ ద్వారా ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను మరో సబ్‌స్టేషన్‌తో లేదా సమీపంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌తో, అలాగే రెండు 33 కేవీ లైన్లను పరస్పరం అనుసంధానం చేయడం జరిగిందని ఆయన వివరించారు. దీనివల్ల ఒక మార్గంలో లోపం ఏర్పడినా, వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్‌ను మళ్లించి నిరంతరాయంగా సరఫరా కొనసాగించవచ్చని, ఇప్పటికే రెండు 33 కేవీ లైన్ల మధ్య ఈ వ్యవస్థ అందుబాటులోకి రాగా, మరో ఐదు ఇంటర్లింకింగ్ లైన్ల పనులు వేగంగా పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ ద్వారా వినియోగదారులకు ఇబ్బంది లేకుండానే సిబ్బంది సులభంగా మరమ్మతు పనులు నిర్వహించుకోవచ్చని, మిగిలిన ప్రాంతాల్లో కూడా ఈ విధానాన్ని విస్తరించేందుకు దశలవారీగా కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామని ఎస్ఈ స్పష్టం చేశారు.

## ప్రజలకు న్యాయం చేయడంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుంది

- **జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారునితో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందినఫిర్యాదులను పరిశీలించి, వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత సీఐలు, ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ఫిర్యాదుల విషయంలో సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేయడంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా పోలీసు అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. చట్ట ప్రకారం ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి బాధితులకు న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తోందని, దీంతో పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతోందని తెలిపారు.

## నూతన మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం

- **ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**



చౌటుప్పల్: కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షునిగా కాసర్ల శ్రీనివాస్ రెడ్డి ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డిని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా సోమవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆత్మీయ మిత్రుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, ఐతరాజు లింగస్వామి, ఊదరి స్వామి, ఐతరాజు శివ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ గఫార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఐటిఐ,ఏటీసీ లలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

- **ప్రిన్సిపాల్ వై. రమేష్**



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : ఐటిఐ, ఏటీసీ సెంటర్లలో వివిధ ట్రేడ్ కోర్సులలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని జన్నారం ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ వై. రమేష్ సూచించారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 2026 ఆగస్టు సెషన్ కు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఖాళీగా ఉన్న సీట్లలో ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు వెంటనే వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కళాశాల పని వేళల్లో నేరుగా ఐటిఐ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

# జన విజ్ఞాన వేదిక పనితీరుపై కలెక్టర్ ప్రశంసలు



నల్గొండ, ప్రజాస్ఫూర్తి : ఎండ తీవ్రతలో ఉపాధి కూలీలు తీసుకోవలసిన జాగ్రత్తలపై గత 40 రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల తో జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ప్రశంసించారు. సోమవారం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రతినిధులు కలెక్టర్ ఛాంబర్ లో ఆయనను కలిసిన సందర్భంగా కలెక్టర్ పై విధంగా స్పందించారు. సమాజ ఉపయోగ కార్యక్రమాలను స్వచ్ఛందంగా జన విజ్ఞాన వేదిక చేపట్టడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలికా శిశు సంక్షేమ శాఖ సహకారంతో డిజైన్ చేసిన పోస్టర్లను విడుదల చేశారు. విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రతినిధులు ప్రొఫెసర్ బి.యన్.రెడ్డి, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు రాష్ట్ర కార్యదర్శి ఎన్ వెంకటరమణారెడ్డి జన విజ్ఞాన వేదిక చేస్తున్న శాస్త్ర సాంకేతికత వైఖరులపై అవగాహన కార్యక్రమాల వివరాలను కలెక్టర్కు వివరించారు. మూఢనమ్మకాల అంశంపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించడంతో పాటు మూఢనమ్మకాల ఘటనలపై ఆయా గ్రామాల్లో ప్రజల్లో నెలకొన్న మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహించడం, ఉన్నత పాఠశాల విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్ సంబరాలు నిర్వహించడం ప్రతి ఏటా జనవిజ్ఞాన వేదిక చేపడుతున్నట్లు కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు బి.యన్.రెడ్డి , కోయ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్ వెంకట రమణారెడ్డి తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కోలా శ్రీనివాస్, మహిళా సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ దగ్గుపాటి విమల జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గుత్తికొండ సుదర్శన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చేపూరి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ప్రజాస్ఫూర్తి : 21వ తేదిన నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్షను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణం లో నిర్వహించేందుకు అన్ని శాఖలు స మన్వయంతో పనిచేయాలని సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. జిల్లా లోని రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 588 మంది అభ్యర్థులు పరీక్ష కు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు,విద్యుత్,మరుగుదొడ్లు,వైద్య సదుపాయాలు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని, సీ.సీ కెమెరాల పనితీరును పరిశీలించాలని సూచించారు. బయోమెట్రిక్ ధృవీకరణ అనంతరమే అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించాలని, సెల్‌ఫోన్లు సహా నిషేధిత వస్తువులను అనుమతించవద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు లో ఉంటుందని, పటిష్ట పోలీసు బందో బస్తు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడిం చారు. అభ్యర్థులు హాల్‌టికెట్ లోని సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ, సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

## పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలి



మహబూబాబాద్, ప్రజా స్ఫూర్తి : దేశానికి అన్నం పెడుతున్న రైతుకు నష్టం తెచ్చే పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాయం చిన్న చంద్రన్న అన్నారు. ఏఐయుకేఎస్ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మహబూబాబాద్ జిల్లా అడిసినల్ కలెక్టర్ కి వినతిపత్రం ఇచ్చారు. చంద్రన్న మాట్లాడుతూ కల్తీ లేని విత్తనాలను, పురుగుమందులను రైతాంగానికి అందించాలని, కల్తీ విత్తనాలు అమ్మిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కచ్చితంగా శిక్షించాలని అన్నారు.యుద్ధం సాకుతో భారీగా పెరిగిన ఎరువుల ధరలతో రైతాంగం మరింత అప్పుల పాలయ్యే ప్రమాదం ఉందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు సబ్సిడీలు, రుణమాఫీలు,అప్పుల రద్దు చేస్తూ దేశానికి అన్నం పెడుతున్న రైతు పండించే పంటకు ఎరువుల ధరలు భారీగా పెంచడం సిగ్గుచేటు అన్నారు.రైతులకు అవసరమగు పంట రుణాలను సకాలంలో అందించి ప్రైవేట్ అప్పుల బారిన పడకుండా రైతాంగాన్ని కాపాడాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీ పంట గిట్టుబాటు ధర చట్టాన్ని చేసి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని లేదంటే ఢిల్లీ తరహా లో రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళన చేయక తప్పదని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఉడుగుల రాములు, జిల్లా సహాయ కార్యదర్శి ఈక బిక్షం, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఉమ్మగాని సత్యం,జిల్లా నాయకులు బూర్గుల మోష, వినోద తదితరులు పాల్గొన్నారు.

## దిక్కులేని వృద్ధుడికి దిక్కైన సీఐ

* ఆకలి తీర్చి.. ఆశ్రయం కల్పించి మానవత్వం చాటిన పోలీసులు.



జనగామ, ప్రజాస్ఫూర్తి : రైల్వే స్టేషన్ ప్రాంతంలో అనాధగా తిరుగుతూ ఆందోళనలో ఉన్న ఓ వృద్ధుడికి సీఐ సత్యనారాయణ రెడ్డి అండగా నిలిచి మానవత్వాన్ని చాటారు. వృద్ధుడిని ఓ దార్చి, ఆహారం అందించి, అనంతరం రాజేశ్వరి వృద్ధాశ్రమంలో చేర్పించి కొత్త జీవితానికి బాటలు వేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన దుర్గా స్వామి అలియా స్ దుర్గా నాయుడు అనే వృద్ధునికి కు టుంబ సభ్యులు లేక అనాధగా జీవిస్తు న్నట్లు తెలిపాడు. సమాచారం అందు కున్న వెంటనే స్పందించిన సీ.ఐ అతని వివరాలు సేకరించి, భోజనం ఏర్పాటు చేసి, పోలీస్ వాహనం లో వృద్ధాశ్రమాని కి తరలించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్, తన సిబ్బంది చూపిన మానవత్వానికి స్థాని కులు అభినందనలు తెలిపారు. రోడ్ల పై అనాధలుగా కనిపించే వారి గురించి పో లీసులకు సమాచారం అందిస్తే తగిన స హాయం అందించేందుకు చర్యలు తీసు కుంటామని వారు పేర్కొన్నారు.

## ప్రజావాణి లో సమస్యల వెల్లువ.. త్వరిత పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణి కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి లో మొత్తం 510 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యల పరి ష్కారం లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం లో వేగం పెంచ డంతో పాటు పెండింగ్ లేకుండా ఎప్పటి కప్పుడు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవె న్యూ) బెన్ షా లోమ్, డీఆర్డీఓ భాస్కర్, సీపీఓ చిన కోట్యా నాయక్, వివిధ శాఖ ల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ మున్సిపాలిటీని.. మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి చొరవ

\- చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దూరదృష్టి..సహకారంతో..చౌటుప్పల్ మున్సిపాలిటీని మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ వార్డుల్లో సోమవారం వార్డు సభలను విజయవంతంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా, మున్సిపల్ కమిషనర్ శ్రీ ఎన్.వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో 8వ వార్డు సభ వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన, 16వ వార్డు సభ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాసు అధ్యక్షతన, 17వ వార్డు సభ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు అధ్యక్షతన, 18వ వార్డు సభ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ అధ్యక్షతన, 20వ వార్డు సభ వార్డు కౌన్సిలర్ హన్ను మహమ్మద్ అధ్యక్షతన ఆయా వార్డు సభలు నిర్వహించారు. చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. చౌటుప్పల్‌ను మోడల్ సిటీగా తీర్చిదిద్దడంలో ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా తాను ప్రతిరోజూ ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మున్సిపల్ కార్యాలయం లో అందుబాటులో ఉంటానన్నారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా నేరుగా వచ్చి తనను కలవవచ్చని, తమ సమస్యను తెలియపరచవచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ ప్రజలు చెత్తను మున్సిపల్ చెత్త ఆటోకు మాత్రమే ఇవ్వాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల ఇరుపక్కలా, డ్రైనేజీలలో చెత్త వేస్తే రూ.500నుంచి రూ.5వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సభల్లో ఎస్ఐ కృష్ణమల్, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ బాబా షరీఫ్, షేక్ నాబీబీ జానీ బాబా, పస్తం గంగారాములు, మెడికల్ ఆఫీసర్ కాటమరాజు, షాదీఖానా చైర్మన్ కరీం, ఎజాస్ పాషా, మాజీ ఎంపీపీ చిక్క నరసింహ, కానుగుల వెంకటయ్య, బండారు నరసింహ, ఎండీ పాషా, ఖలీల్, ఆవుల యేసు, ఆర్వో అంజయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘనపూర్ లో విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం



స్టేషన్ ఘనపూర్, ప్రజాస్ఫూర్తి : జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రూ.60.62 కోట్ల వ్యయంతో చేపట్టిన విద్యుత్ అభివృద్ధి పనులకు మంగళ వారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్ర మార్క చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్నారు. ఈ సందర్భంగా నాలుగు నూతన విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రారంభించడం తో పాటు మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు.ఎన్పీడీసీఎల్ సీ.ఎం.డీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఈ పనుల ద్వారా మొత్తం 60,838 మంది విని యోగదారులకు ప్రత్యక్ష ప్రయోజనం కలగనుంది. వేలేరు మండలంలోని పీచర లో రూ.43.92 కోట్లతో నిర్మించిన 13 2 /33 కేవీ సబ్‌స్టేషన్ తో పాటు కొండా పూర్, సాగరం, కుర్చపల్లి ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ప్రారంభం కాను న్నాయి. అలాగే చిల్పూర్ మండలం లో ని పల్లగుట్ట,లింగంపల్లి,నష్కల్ గ్రామాల్లో రూ.9.66 కోట్ల వ్యయంతో మూడు నూతన 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు శంకు స్థాపన చేయనున్నారు. ఈ సబ్ స్టేషన్లు అందుబాటులోకి రావడం తో చుట్టూ పరిసర గ్రామాల్లో విద్యు త్ సరఫరా మరింత స్థిరంగా మారనుం ది.వోల్టేజ్ నాణ్యత మెరుగు పడి, విద్యు త్ అంతరాయాలు తగ్గడం తో పాటు వ్యవసాయ, గృహ, వాణిజ్య, పారిశ్రామిక విని యోగదారులకు నాణ్యమైన విద్యు త్ అందుబాటులోకి రానుంది. విద్యుత్ రంగ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టులు కీలక మైలు రాయిగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

## సాయిబాబా గుడి వద్ద డ్రైనేజీ రోడ్డును తక్షణమే నిర్మించాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33, 34, 35 వార్డుల సభలు ఐఎంఏ హాల్ లో జరగగా ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ గూగులోత్ జ్యోతి, పాల్గొనగా టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ పోతరాజు 35 వ వార్డు కౌన్సిలర్ గద్దె నీరజారాణి, డీ ఈ ఉపేందర్ పాల్గొనగా ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 33 వ వార్డు కౌన్సిలర్ బి అజయ్ సారధి రెడ్డి పలు సమస్యలను చైర్ పర్సన్, అధికారుల దృష్టికి తీసుకోవచ్చారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని నిలిచిపోయిన సాయిబాబా గుడి వద్ద డ్రైనేజీ వెంటనే నిర్మించి రోడ్డును తక్షణమే వేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో రాకపోకలకు, భక్తులకు ప్రజా రవాణాకు ఇబ్బందులు ఎదురవుతున్న సందర్భంగా తక్షణమే చర్యలు తీసుకొని డ్రైనేజీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. గత కొన్ని నీళ్లు గా పెండింగ్ లో ఉన్న వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని అధికారులను ప్రజా ప్రతినిధులను కోరారు. వర్షాకాలం వస్తున్న సందర్భంగా పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజలు వివిధ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ ను నిషేధించడానికి తగిన చర్యలు అధికారులు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలం నేపథ్యంలో మొక్కలు నాటి భవిష్యత్తు తరాలను ఆదుకోవాలని అధికారులను ప్రజలకు సూచించారు. ముఖ్యంగా 33 వ వార్డులో పెన్షన్ వివిధ సమస్యలు ఉన్న వారి యొక్క వినతి పత్రాలను బి అజయ్ సారధి రెడ్డి స్వీకరించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీహరి, వార్డు ఆఫీసర్లు భారత రమేష్, రమ్య, చంద్రిక, వరుణ్ బిల్ కలెక్టర్ శ్రీనివాస్ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, పడిదల కవిత, యూసుఫ్ పాల్గొన్నారు.


## మర్రిగూడఎల్లమ్మ తల్లికి ఘనంగా బోనాల సమర్పణ



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ పట్టణం మర్రిగూడ ఎల్లమ్మ తల్లికి సోమవారం గ్రామస్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. ఆదివారం రాత్రి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్నిలా కళ్యాణం కన్నుల పండుగగా అత్యంత భక్తి శ్రద్ధలతో వేదమంత్రాలు నడుమ భాజ భజంత్రీలు నడుమ భక్తులగ్రామస్తుల అమ్మవారి పారాయణంతో కళ్యాణాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. అనంతరం సోమవారం గ్రామంలోని ప్రతి ఇంటి నుండి బోనం తీసుకొని పూరదేవులకు మొక్కులు చెల్లించి అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, 13వ డివిజన్ కార్పోరేటర్, గుమ్ముల జానకి మోహన్ రెడ్డి, 14వ వార్డు కార్పొరేటర్ బొజ్జ శంకర్, గుమ్ముల మోహన్ రెడ్డి, గ్రామస్తులు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## నూతన మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం

\- ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షునిగా కాసర్ల శ్రీనివాస్ రెడ్డి ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డిని ధర్మోజిగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా సోమవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆత్మీయ మిత్రుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, ఐతరాజు లింగస్వామి, ఊదరి స్వామి, ఐతరాజు శివ తదితరులు పాల్గొన్నారు.

## పోదెం వీరయ్యకు లండన్ కిడ్స్ ఉపాధ్యాయ బృందం సన్మానం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలోని లండన్ కిడ్స్ పాఠశాలను తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోదెం వీరయ్య సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై విద్యా రంగంలోని పలు అంశాలపై చర్చించారు. ఉపాధ్యాయుల సమస్యలు,విద్యార్థుల అభ్యాస స్థితిగతులు, పాఠశాల నిర్వహణ గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా పోదెం వీరయ్య మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు.విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని,అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువలను కూడా బోధించాలని సూచించారు.అనంతరం లండన్ కిడ్స్ పాఠశాల చైర్మన్ బూర పూర్ణచందర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం పోదెం వీరయ్యను శాలువాతో ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బూర పూర్ణచందర్,డోలి శివ,బూర శరణ్య,గాడిపెల్లి సుమన్,భూక్యా హిమబిందు,కుసుమ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

# విలేకరి సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కేసముద్రం మండలం, ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు, వార్త పత్రిక విలేకరి ఎసల్ల సత్యనారాయణ తండ్రి భిక్షం యాదవ్ (71) అనారోగ్యంతో హనుమకొండ లోని రోహిణి ఆస్పత్రిలో మృతి చెందడం పట్ల సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.సోమవారం ఉప్పరపల్లి గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లిన సమ్మిగౌడ్, భిక్షం యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారులు వెంకన్న, సత్యనారాయణ, మహేశ్వర్ లతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో సి ఏ వచ్చాల సాంబయ్య, కంచ వెంకన్న,8వ వార్డు మెంబర్ పలుస పద్మ వెంకన్న,9వ వార్డు మెంబర్ తండా సంపత్,బండారు గోపి, శాగంటి రాములు,ఎటూరోజు పరిపూర్ణ, కట్ల పాపయ్య, కోమాకుల రమేష్, మెట్టు రవీందర్,గంట రవి,గైయి ప్రవీణ్, మంద అఖిల్, వెన్ను సురేందర్,పాత్రికేయులు,సమ్మిగౌడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పై వేగవంతమైన చర్యలు..

*** భూ రికార్డుల శుద్ధీకరణకు కలెక్టర్ ప్రత్యేక దృష్టి**

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ప్రజా ఆస్తుల భూ నమోదుల పై కఠిన చర్య లు, ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదు ల పరిష్కారానికి ప్రత్యేక ఫాలోఅప్ వ్య వస్థను అమలు చేస్తూ, ప్రజా ఆస్తుల పరిరక్షణ, భూరికార్డుల శుద్ధీ కరణ పై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారి స్తోంది. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మార్గదర్శకత్వంలో భూ వివాదా లు, ఆక్రమణలు, అక్రమ నమోదులపై సమగ్ర విచారణలు చేపట్టి కీలక నిర్ణ యాలు తీసుకుంటున్నారు. ప్రజావాణి లో వచ్చిన ఒక ఫిర్యాదు ఆధారంగా జరిగిన విచారణలో పది మంది పేర్ల పై ఉన్న పట్టా దారు పాస్‌పుస్తకాలకు సం బంధించిన 13 బి, మ్యుటేషన్,వారస త్వ ఫైళ్లుగల్లంతైనట్లు గుర్తించరు. సరైన ఆధారాలు లేకుండా జరిగిన నమోదుల ను గుర్తించిన అధికారులు, అక్రమంగా జారీ చేసిన పాస్‌పుస్తకాలను రద్దు చేసి అసలు చట్టబద్ధ పట్టాదారుల పేర్లకు భూ రికార్డులు పునరు ద్ధరించాలని ఆదేశించారు. భూ రికార్డుల్లో పారదర్శ కత, ప్రభుత్వ భూముల రక్షణ, ప్రజా హక్కుల పరిరక్షణ లక్ష్యంగా చేపడుతు న్న, ఈ చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ జిల్లా క్యాంపులు

*** హైరిస్క్ గర్భాలపై ప్రత్యేక దృష్టి: డిఎంహెచ్ఓ**




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో ప్రతి నెల 9వ తేదిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకట రమణ తెలిపారు.గర్భిణీ స్త్రీలకు ప్రధానంగా హైరిస్క్ గర్భాలను ముందుగానే గుర్తించి, తగిన వైద్య పరీక్షలు, చికిత్స, పర్యవేక్షణ అందించడం. రక్తపోటు, రక్తహీనత, మధుమేహం వంటి పరీక్షలు చేసి అవసరమైన వైద్య సలహాలు, మందులు ఇవ్వడం, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది తమ పరిధిలో గర్భిణీలను గుర్తించి పీఎం ఎస్ఎంఎస్ సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి. ముఖ్యంగా 2వ, 3వ త్రైమాసికంలో ఉన్న గర్భిణీలు తప్పనిసరిగా సమీప ప్రభుత్వ ఆరోగ్య సంస్థను సంప్రదించి ఉచిత వైద్య సేవలు పొందాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత గర్భిణీ సేవలను సద్వినియోగం చేసుకొని తల్లి, శిశు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డిఎంహెచ్ఓ కోరారు.

# వార్డు సభకు హాజరైన సాజిద్ ఖాన్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: 99 రోజుల ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా 34 వార్డు సభను మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ 34 వార్డు ఇంచార్జ్ సాజిద్ ఖాన్, కౌన్సిలర్ తహెర్ పాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాజిద్ ఖాన్ మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేయాలని కోరారు. యువ నాయకుడు, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది నిరంతరం పట్టణ ప్రజల సమస్యలను తీర్చడానికి కృషిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ప్రభుత్వ పథకాలపై అవగాహన పొందారు. పేదలకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులు సూచించారు. మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్ స్వేచ్ఛ, టూ టౌన్ ఎస్సై వగ్గు వెంకన్న , ఆర్పీ రోజా, సక్కుబాయ్, మైనార్టీ నాయకులు ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.2525

# ప్రజల ఇబ్బందులను పరిష్కరించడానికే ప్రజావాణి కార్యక్రమం



మహబూబాబాద్, ప్రజా స్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమం ప్రజల నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వినతిపత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుండి తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చే ప్రజల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.అందిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి,సంబంధిత శాఖల ద్వారా సత్వరమే పరిష్కార మార్గాలను చూపాలని అధికారులను ఆదేశించారు.అదనపు కలెక్టర్లు అనిల్ కుమార్, (ఇంచార్జ్) పురుషోత్తం పర్యవేక్షణలో, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వర్గీకరించి,వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ స్నేహ శబరీష్ స్వయంగా వినతులను స్వీకరించారు.వారి సమస్యలను ఓపికగా విని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం ( 170 ) దరఖాస్తులు వచ్చాయి.మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోని బాత్‌రూమ్‌లకు తాళాలు వేసి ఉంచడం వల్ల, చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి పక్కనే ఉన్న సందులలో మూత్ర విసర్జన చేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి, దుర్వాసనతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఆసుపత్రి మేనేజ్‌మెంట్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.యాసారపు శిరీష భర్త మురళి, గ్రామం వెంకటాపురం, మండలం కేసముద్రం, చెందిన తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, భర్త తనను వదిలేసి వెళ్ళిపోవడంతో ఎలాంటి జీవనాధారం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను పోషించుకోవడానికి తనకు 'ఒంటరి మహిళా పింఛన్' మంజూరు చేయాలని కలెక్టర్ను వేడుకున్నారు.గడిశల వెంకన్న తండ్రి జల్సయ్య, తాళ్ళపూసపల్లి నుండి చెముల్లాపూర్ వరకు వెళ్లే ప్రధాన సాగునీటి కాలువ (నక్షా ప్రకారం ఉన్న రోడ్డు/కాలువ) పూడికకు గురైందని, దీనివల్ల రైతులకు సాగునీరు అందడం లేదని పేర్కొన్నారు. సర్వే నిర్వహించి, కాలువను పునరుద్ధరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.మాధవి భర్త మాదంతి, గ్రామం: బంచరాయితండా, మండలం గూడూరు, తాము పెంకుటింట్లో నివసిస్తున్నామని, వర్షం వస్తే ఇల్లంతా నానుతూ కూలిపోయే స్థితికి చేరిందని తెలిపారు.గతంలో మొదటి లిస్ట్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఇల్లు మంజూరు కాలేదని, రెండవ లిస్ట్‌లో అయినా తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.ఎస్.కె. ఖాసిం సాహెబ్ తండ్రి ఖాదర్ సాహెబ్, మహబూబాబాద్ మండలం ఈదులపూసపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 102 మరియు 103 లలో గల భూమికి సంబంధించి కొంత కాలంగా సమస్య నెలకొని ఉందని, దీనిపై విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా,అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగులు, ప్రతి ఒక్కరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం పొందాలని సూచించారు,వచ్చేవారం,పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలు వసతి గృహాలను తనిఖీ చేసి పిల్లలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు,జిల్లాలో రికార్డు స్థాయిలో మక్కజొన్నలు,వరి ధాన్యం ఉత్పత్తి అయినందున అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాటు చేసి తరలించడం జరిగిందని, అందుకోసం కృషిచేసిన బాధ్యతాయుతంగా పనిచేసే ప్రత్యేకంగా ప్రతి ఒక్కరిని అభినందించారు, ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) అదనపు కలెక్టర్ ఇంచార్జ్ స్థానిక సంస్థల పురుషోత్తం,డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు,కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్నివిభాగాల అధికారులు పాల్గొన్నారు.





# జీవిత బీమా పథకం ఐదు లక్షలతో పేదోడికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గొప్ప వరం

*** బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ముగింపు వార్డ్ సభకు స్థానిక సంస్థ బర్రె పూజిత జహంగీర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో పట్టణ ప్రజలకు పలు అభివృద్ధి, పారిశుద్ధ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో పట్టణాభివృద్ధి, ప్రజా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కీలక అంశాలను ప్రజలకు వివరించారు.ప్రత్యేకంగా సాలిడ్ వెస్ట్ మేనేజిమెంట్ రూల్స్-2026, జల్ సంచయ్ - జల్ భగీరత పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణం, మురికి కాలువల శుభ్రత మరియు పూడిక తొలగింపు పనులు, వర్షాకాల సంసిద్ధత చర్యలు, తాగునీటి సరఫరా మరియు నిర్వహణ, నీరు నిలిచే ప్రాంతాల నివారణ, పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల నిర్వహణ, వీధి దీపాల సంరక్షణ, మొక్కల పెంపకం మరియు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రజా సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి వార్డు సభల్లో విస్తృతంగా చర్చించి, ప్రతి వార్డులో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పట్టణ ప్రజలు ఈ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకుని తమ వార్డుల అభివృద్ధికి సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు. వార్డు నివేదిక సభలో చదివి భవిష్యత్తులో వార్డు ప్రజలకు చేసే అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో ముందుకు పోతామని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వార్డు ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

*** హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి**



హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం 4,6,7,9,16 వార్డులలో వార్డు సభ లు వార్డ్ కౌన్సిలర్ల అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వార్డు సభలకు ముఖ్యఅతిథిగా పురపాలక సంఘ చైర్పర్సన్ దండి లక్ష్మి హాజరు కావడం జరిగింది.వార్డ్ సభలు నిర్వహించిన అనంతరం రోడ్ లు శుభ్రపరచడం, డ్రైనేజీలు క్లీన్ చేయడం, మొక్కలు నాటడం,స్ప్రే చేయించడం, బ్లీచింగ్ చల్లించడం లాంటి కార్యక్రమాలు చేయడం జరిగింది. చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రత తో పాటు పట్టణ పరిశుభ్రత కోసం భాగస్వాములు కావాలని, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ ప్రకారం చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి పురపాలక సంఘ వాహనానికి అందించాలని,వార్డ్ సమస్యలు ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్స్ పిల్లి తిరుపతి , గడిపె సంపత్, వైద్యం కిరణ్ ప్రసాద్,కో ఆప్షన్ మెంబర్ పున్న లావణ్య, మున్సిపల్ అధికారులు,జవాన్ లు మెప్మా రిసోర్స్ పర్సన్స్ ఆశా వర్కర్ లు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

**– ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిరుద్యోగ సమస్యను రూపుమాపడం చేతగాని ప్రభుత్వాలకు పాలించే హక్కు లేదని, మోసపూరిత వాగ్దానాల చేసి యువతరం ఓట్లతో గద్దెనెక్కిన తర్వాత పాలకులు నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె.ఫహీమ్ దాదా అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ అంకిత్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ప్రభుత్వాలకు అధికారాన్ని కట్టబెట్టిన యువత బ్రతుకులు నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం, మౌళిక వసతుల కొరత, నిధుల లేని కారణంగా ప్రభుత్వ విద్య నానాటికీ బలహీన పడుతోందన్నారు. ఇదే సమయంలో కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో దోపిడీ చేస్తున్నాయని, ఫీజుల నియంత్రణా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో అన్నిశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులపై శ్వేత పత్రం విడుదల చేయాలని, పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి శాశ్వత నియామకాలు చేపట్టాలని టిజి పిఎస్సి ద్వారా వార్షిక నియామక క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువతను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. వినతి పత్రం అందించిన వారిలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె. ఖయ్యూమ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రసూల్, రౌతు సురేష్, దాసరి శివ, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతికి తక్షణ స్పందన.. ఇద్దరు వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రాలు సమర్పించిన ఇద్దరు వికలాంగ మహిళలకు అధికారులు తక్షణమే బ్యాటరీ ట్రై సైకిళ్లు మంజూరు చేశారు. స్టేషన్ ఘనపూర్ మండలం సము ద్రాల గ్రామానికి చెందిన ఈగ పారిజా తం, కొడకండ్ల మండలం నరసింగపు రం గ్రామానికి చెందిన జేడీ చంద్రకళ జీవనోపాధి,రవాణా సౌకర్యం కోసం బ్యాటరీ ట్రై సైకిళ్లు అవసరమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు వినతి పత్రాలు అందజేశారు. వినతులను పరి శీలించిన కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయగా, అర్హతలు నిర్ధారించిన అనంతరం ఇద్ద రు లబ్ధిదారులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు అందజేశారు.దీంతో వారి రవాణా సమ స్యకు తక్షణ పరిష్కారం లభించింది. ట్రై సైకిళ్లు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ, స్వతంత్రంగా తమ పనులు చేసుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపా రు. ప్రజావాణిలో చేసిన వినతికి వెంట నేస్పందించి సహాయం అందించిన జి ల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటన విక లాంగుల సంక్షేమం పై ప్రభుత్వ నిబద్ధత ను, ప్రజల సమస్యల పరిష్కారంలో అ ధికారుల స్పందనాత్మకతను ప్రతిబింబి స్తోంది.

# పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగముగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా సోమవారం ఉదయం 10.00 గంటలకు మెదక్ పట్టణంలోని వార్డు నెంబర్లు 07, 08, 09, 12, 20, 25, 26, 30 & 31 వార్డులలో వార్డు సభలు సంబంధిత వార్డు కౌన్సిలర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఈ సభలలో మున్సిపాలిటీ చేపట్టుచున్న వివిధ కార్యక్రమాలు ఘణ వ్యర్థ పదార్థాల నిర్వహణ, ఇంటి వద్ద, వివిధ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు, మురికి కాలువలను పూడిక తీయుట, మురికి కాలువల శుభ్రత, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేపట్టనున్న వివిధ కార్యక్రమాలను వివరించారు.ప్రజలకు త్రాగునీటి సరఫరా అందించుట, వివిధ ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూచుట, పట్టణంలో పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించుట, రోడ్లను మరియు వీధి దీపాలను మెయింటెనెన్స్ చేయుట, మొక్కలు నాటుట, పర్యావరణ పరిరక్షణ గురించి తీసుకోనున్న చర్యలు, వరదలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు మున్సిపాలిటీ నుండి చేపట్టనున్న వివిధ ఇతర కార్యక్రమాల గురించి వార్డు సభలలో ప్రజలకు వివరించడం జరిగినది. ప్రజలు వార్డులలో గల వివిధ సమస్యల గురించి తెలిపారు.ఈ వార్డు సభలకు గౌరవ చైర్ పర్సన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ నవీన్, సంబంధిత వార్డుల అధికారులు మరియు మున్సిపల్ ఇతర సిబ్బంది, మహిళ సంఘాల గ్రూప్ సభ్యులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల మాఫియా పై కఠిన చర్యలు తీసుకోండి

**: సారంపల్లి మల్లారెడ్డి**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యం లో ఫర్టిలైజర్, విత్తనాల దుకాణాలను పరి శీలించిన రైతు సంఘం నాయకులు నకిలీ విత్తనాల వ్యాపారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. ఈ సందర్భంగా ఆలిండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ నకిలీ, కల్తీ విత్తనాల విక్రయాలను అరికట్టడంలో ప్రభుత్వం, వ్యవసాయ శాఖ విఫలమ య్యాయని విమర్శించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అం దుబాటు లో ఉంచడం తోపాటు ఎరు వుల ధరల పెంపును వెంటనే వెనక్కి తీ సుకోవాలని కోరారు. రైతులకు పంట రుణాలు,రైతు భరోసా నిధులు సకాలం లో అందించాలని, నకిలీ విత్తనాల తో నష్టపోయిన రైతులకు పూర్తి నష్టపరిహా రం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# రైతులు సమగ్ర వ్యవసాయ విధానాన్ని అలవర్చుకోవాలి

*** వంట మార్పిడి చేపట్టాలని రైతులకు ఏడీఏ వాణి సూచన**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : ఎల్ నినో ప్రభావంతో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో రైతాంగం సమగ్ర వ్యవసాయ విధానాన్ని అలవర్చుకోవాలని హుస్నాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ వాణి సూచించారు. హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ క్లస్టర్ గ్రామాల పరిధిలో సమగ్ర వ్యవసాయ క్లస్టర్ కార్యక్రమంలో భాగంగా మీర్జాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేపట్టాలని, ఒకే పంటపై ఆధారపడకుండా పప్పుధాన్యాలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీపీఎం వాసుదేవ్ మాట్లాడుతూ ఐఎఫ్‌సీ గ్రామాల్లో రైతులకు వివిధ సేవలు అందించేందుకు పల్లె మహిళా జీవనోపాధుల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు విత్తనాలు వ్యవసాయ పనిముట్లు సేంద్రియ ఎరువులు తదితర అవసరమైన సామగ్రి అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఏపీఎం తిరుపతి మాట్లాడుతూ భూసార అభివృద్ధి, చెరువుల పూడికతీత పనులకు చర్యలు చేపట్టామని, అలాగే వ్యవసాయ ఉత్పత్తుల విలువ వృద్ధి కోసం ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు దిశగా రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.వాసన్ ఎన్జీవో ప్రతినిధి అనిల్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా మీర్జాపూర్ క్లస్టర్‌పై సమగ్ర నివేదిక రూపొందించామని, దానికి అనుగుణంగా ప్రభుత్వ శాఖలు, ఇతర సంస్థల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి పూజ మాట్లాడుతూ పంట మార్పిడి కార్యక్రమంలో రైతులందరూ భాగస్వాములు కావాలని, ఇందుకు వ్యవసాయ శాఖ నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్జాపూర్ సర్పంచ్ సంపత్ కుమార్, బల్లునాయక్ తండా సర్పంచ్ జవహర్, సీసీ బిక్షపతి, ఏఈవో సంగీత ఉపసర్పంచ్ లుస్వర్ణకుమార్ మౌనిక, వీవో అధ్యక్షులు వాణి భారతి, శారద, వీవోఏలు సుదర్శన్, సునీత, నిర్మలతో పాటు మహిళలు, రైతులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై పోలీసు శాఖ మరింత స్పందనతో వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు.

# తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

**: దండు మల్కాపురంలో ధాన్యం నిల్వకు గోదాముల పరిశీలన**

**- జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డి**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అకాల వర్షాలతో ధాన్యం తడిస్తే బాధపడాల్సిన అవసరం లేదని.. తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామం పరిధిలో ధాన్యం నిల్వ చేయడానికి వీలుగా రెండు గోదాములను సోమవారం పరిశీలించారు. ధాన్యం నిల్వ చేయడానికి వీలుగా ఉందని గుర్తించారు. ఈ సందర్భంగా జెసి వెంకారెడ్డి మాట్లాడుతూ రైతులు అధైర్య పడద్దని, ఆందోళనకు గురికావొద్దని సూచించారు. ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. అపోహలు నమ్మవద్దని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. వరి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, డీఎస్ఓ రోజా రాణి, తహసిల్దార్ వీరాబాయి, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగొని అంజయ్య గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంచర్లకుంట రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో

# మహబూబాబాద్ తాహసిల్దార్ పై ఫిర్యాదు



Citizen Copy

GOVERNMENT OF TELANGANA

Mahabubabad District Prajavani Acknowledgment

| | | | |
|---|---|---|---|
| Grievance ID: | DMHBD08062600125 | Grievance Date: | 08-JUN-2026 |
| Citizen Name: | AHMED KHAN | Mobile No.: | 9848477230 |
| Gist of Grievance: | [illegible] | | |

Your Grievance has been forwarded to the Mahabubabad AD SLR - Mahabubabad for resolution. Kindly note the Grievance ID for further reference.

This is a system-generated receipt. No signature required

"You can track the status using the above grievance ID on the Prajavani portal (prajavani.cgg.gov.in)."

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : తహసిల్దార్ జారీ చేసిన"3 నాలా ఆర్డర్ కాపీల"ను రద్దు పరిచి,తహసిల్దార్ పై విచారణ జరిపించి,తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తెలంగాణ ముస్లిం సంఘాల జేఏసీ నాయకుడు అహ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ సెల్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణ శివారు ఈదుల పూసపల్లి గ్రామంలో 447 సర్వేనెంబర్ భూమికి ఇటీవల ముగ్గురు వ్యక్తులకు 1 ఎకరం భూమిలో మహబూబాబాద్ తాహసిల్దార్ అక్కడ భూమి ఉందో లేదో చూడకుండా, సర్వేయర్ చే సర్వే చేయించకుండా "3నాలా కన్వర్షన్ ఆర్డర్ కాపీలు"ఇవ్వడం జరిగింది. ఐదేళ్ల క్రితం ఇలాగే ఇదే, 447 సర్వే భూమిలో తప్పుడు పద్ధతిలో "నాలా ఆర్డర్ కాపీ"ని పొంది "ప్లాట్లు అమ్ముకున్న భూమికే" మహబూబాబాద్ తాహసిల్దార్ మళ్లీ "3నాలా ఆర్డర్ కాపీలు" జారీ చేశారు. భూమి ఉందో,లేదో చూడకుండా "3నాలా ఆర్డర్ కాపీలు" జారీ చేసిన ఇదే తాహసిల్దార్,మా కుటుంబానికి చెందిన 448/B/3 భూమికి "డిలీట్"అయిన"డిజిటల్ సంతకం" కోసం ఏడాదిగా తిరుగుతున్నా మా "భూమి కి డిజిటల్ సంతకం"సరి చేయలేదు. కానీ ఉందో, లేదో తెలియని భూమికి మాత్రం "3నాలా ఆర్డర్ కాపీలు" జారీ చేసి,ఏడాది నుండి మా భూమికి "డిజిటల్ సంతకం"విషయంలో ఇబ్బందులకు గురి చేస్తున్న తాహసిల్దార్ పై తగు చర్యలు తీసుకోవాలని, మా భూమి కి "డిజిటల్ సంతకం" చేయుటకు ఆదేశించారు.

# నీట్ పునఃపరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో నిర్వహించనున్న నీట్ ప్రవేశ పునఃపరీక్షను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి పరీక్షా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించనున్న నీట్ పునఃపరీక్షకు జిల్లాలో మొత్తం 1,128 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఇందుకోసం జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులను ఉదయం 11.00గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, భద్రతా తనిఖీలు వంటి ప్రక్రియల దృష్ట్యా అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. పరీక్షా రోజున విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా కల్పించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, తహశీల్దార్లు పుల్లారావు, దారా ప్రసాద్, పరీక్షా కేంద్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలి

**: పల్లె శేఖర్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ ఈ నెల 10న నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం సిపిఐ కార్యాలయంలో ధర్నా కరపత్రాలను నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి పాలనలో సామాన్యుల బతుకు భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్చేదిన్ వస్తాయని చెప్పి, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినటువంటి వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ధరలు పెంచకుండా, ఎన్నికలు ముగియగానే నెలలో మూడుసార్లు పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లు పెంచడం దేశ ప్రజల్ని మోసం చేయడమేనన్నారు. ప్రస్తుత రిస్థితులను ఆసరాగా చేసుకొని, కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పగిళ్ళ మోహన్ రెడ్డి, ఏఐటీయూసీ పిల్లి శంకర్, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, టంగుటూరు రాములు, దాసరి అంజయ్య, బద్దుల సుధాకర్, దాసరి యాదయ్య, ఉబ్బు సుదర్శన్, డి కృష్ణ, శంకర్ బాబు, డి మనోహర్, చింటు తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా నియమితులైన డీఈఓకు శుభాకాంక్షలు తెలిపిన పాఠశాలల కరస్పాండెంట్స్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారినిగా నూతనంగా నియమితులైన రేణుకని సోమవారం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా కన్వీనర్ డాక్టర్ బోసాని బాలరాజు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జే నాగరాజు, ప్రధాన కార్యదర్శి జి అశోక్,కోశాధికారి కే పరశురాం గౌడ్, బాలానగర్ మండల్ ప్రెసిడెంట్ సుశీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి, కోశాధికారి తబాస్సుమ్ వైస్ ప్రెసిడెంట్ కళ్యాణి, ఘట్కేసర్ మండల్ అధ్యక్షులు పి అంజన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి శేఖర్, వైస్ ప్రెసిడెంట్ దేవదానం, ఉప్పల్ మండల అధ్యక్షులు విజయేందర్ రెడ్డి ,కార్యవర్గ సభ్యులు రాజు, చందన, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ మధార్, అల్తాఫ్, సతీష్, మాజీ అధ్యక్షులు సాగర్, మేడిపల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి ఎల్ ఎన్ రెడ్డి, కుకట్పల్లి మండల్ కార్యవర్గ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, సిహెచ్ వెంకటస్వామి, కాప్రా మండల అధ్యక్షులు మనోహర్, మరియు వారి కార్యవర్గ సభ్యులు గండి మైసమ్మ అధ్యక్షులు బర్మా ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అంబదాస్, కుత్బుల్లాపూర్ ప్రధాన కార్యదర్శి కే నర్సిరెడ్డి, కోశాధికారి డాక్టర్ కే పవన్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు షబానా ఆఫ్రోజ్ ,మండల కార్యవర్గ సభ్యులు బల్వంత్ కుమార్, సాయికుమార్, సరిత, కామేశ్వరి, రజిని లోతోపాటు సుమారుగా వివిధ పాఠశాలల 200 మంది కరస్పాండెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

*** మండల అధ్యక్ష కార్యదర్శులు చిట్టారి వెంకన్న,తోటకూరి రాజశేఖర్**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి:ఈ నెల 10వ తేదీన ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 25వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు చిట్టారి వెంకన్న, తోటకూరి రాజశేఖర్ పిలుపునిచ్చారు.సోమవారం మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ...ఈ మహా సభలకు ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి .వెంకట్, వ్యవసాయ కార్మిక సంఘం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారని తెలియజేశారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం వ్యవసాయ కార్మిక సంఘం అని, ఉపాధి హామీ కార్మికుల హక్కుల కోసం, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలను రద్దు చేయాలని,వ్యవసాయ కార్మికుల కోసం,చిన్న సన్న కారు రైతాంగం కోసం మరెన్నో పోరాటాలు నిర్వహించిన సంఘం వ్యవసాయ కార్మిక సంఘం అని తెలియజేశారు.ఈ జిల్లా మహాసభలకు ప్రజలు, వ్యవసాయ కార్మికులు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శీలం గురుమూర్తి, కందుల బాబు,హరిలాల్, గుగులోత్ నాగేశ్వరరావు, ఉపేందర్, ప్రసాద్, పాల్గొన్నారు.

# ప్రజాదివాస్‌లో 15 ఫిర్యాదులు స్వీకరణ తక్షణ పరిష్కారమే లక్ష్యం

**: ఎస్పీ సంకీర్త్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి మొత్తం 15 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదివాస్ ద్వారా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు.

# ఇల్లందు సింగరేణి హైస్కూల్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించండి

**– సింగరేణికి కేంద్ర మంత్రిత్వ శాఖ ఆదేశాలు**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ఇల్లందులోని సింగరేణి హైస్కూల్‌లో నెలకొన్న సమస్యలపై నేషనల్ ఫోరమ్ ప్రతినిధి విశాల్ పాసి కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి అందించిన వినతిపత్రంపై సానుకూలంగా స్పందన లభించింది. ఈ మేరకు కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ అడిషనల్ ప్రైవేట్ సెక్రటరీ ప్రశాంత్ పాంఢ్రే ద్వారా సోమవారం సింగరేణి యాజమాన్యానికి లేఖ జారీ చేశారు. లేఖలో ఇల్లందు సింగరేణి హైస్కూల్‌లో మౌలిక వసతులు, నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్యను అందించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని, స్కూల్ జోన్ పరిసరాల్లో ప్రమాదాలు జరగకుండా రక్షణ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పేద విద్యార్థుల రక్షణ, భవిష్యత్తు కోసం స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి నేషనల్ ఫోరమ్ ప్రతినిధి విశాల్ పాసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నెహ్రూ నగర్ లో బిజెపి జెండా ఆవిష్కరణ



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డి నగర్ లోని నెహ్రూ నగర్ లో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఇన్చార్జ్ నందనం దివాకర్ సూచన మేరకు బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షులు బుర్ర మణికంఠ అధ్యక్షతన మేడ్చల్ జిల్లా బిజెపి ఇంచార్జ్ డాక్టర్ ఎస్ మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జే.కె.శేఖర్ యాదవ్ , బిజెపి చింతల డివిజన్ సదానంద్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి బిజెపి జెండా ను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు లింగం వెంకటేశ్వరరావు , నారాయణ గౌడ్, శ్రీనివాస్, ఆశ, మీనా , హంస , మానే సంజు, రాజు గౌడ్, మురళీకృష్ణ, రామ్ రెడ్డి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, బస్తి వాసులు తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

*** కాంట్రాక్టర్స్అసోసియేషన్**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వంలో తాము అనేక అభివృద్ధి పనులకు కాంట్రాక్టు పనులు చేసి బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆర్థిక పరిస్థితి రోజురోజుకు క్షీణించిపోతుందని వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆల్ ఇండియా ఫాస్ట్ నేషనల్ ప్రెసిడెంట్,డి వి ఎన్ రెడ్డి,వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాసరావు, రాష్ట్ర ట్రెజరర్ సంతోష్ రెడ్డి, నల్గొండ సెంటర్ చైర్మన్ వి శ్రీనివాస్ రెడ్డి,,నల్గొండ మొదటి చైర్మన్ కృష్ణారావు,లు తెలిపారు. సోమవారం స్థానిక వెంకటరమణ బాంకెట్ హాల్ లో చలో హైదరాబాద్కు సంబంధించిన వాల్ పోస్టర్లు రిలీజ్ చేసి సనహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు ₹20,000 కోట్ల బకాయిలు ఉన్నాయని చిన్న కాంట్రాక్టర్లు బిల్లులు రాక మనోవేదనకు గురై అనారోగ్యం పాలై మరణిస్తున్నారని వాపోయారు.రోడ్లు భవనాలు తాగునీటి ప్రాజెక్టులు తాగునీటి పథకాలు ఇతర మౌలిక సదుపాయాల వంటి పనులు చేపట్టి ఏండ్లు గడుస్తున్న ప్రభుత్వం బిల్లును విడుదల చేయడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టర్లతోపాటు బిల్లులు రాక ఉద్యోగులు ఇంజనీర్లు కార్మికులు సరఫరాదారులు వారి కుటుంబ సభ్యులు కూడా తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వం వెంటనే కాంట్రా పెండింగ్ బిల్లులు చెల్లించి కాంట్రాక్టర్లను వారి మీద ఆధారపడిన కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. జూన్ 18న హైదరాబాద్లో నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నల్గొండ జిల్లాలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆల్ ఇండియా పాస్ట్ ప్రెసిడెంట్ ఎస్.ఎన్. రెడ్డి, ఆల్ ఇండియా పాస్ట్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డి.వి.ఎన్. రెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్ సి. హెచ్. శ్రీనివాసరావు, రాష్ట్ర ట్రెజరర్ జి. సంతోష్ రెడ్డి, నల్గొండ సెంటర్ చైర్మన్ వి. శ్రీనివాస్ రెడ్డి మొదటి నల్గొండ సెంటర్ చెర్మన్ ఎస్. కృష్ణారావు మరియు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## టీఎంసీ రెబల్ ఎంపీలపై
# మహువా మొయిత్రా ఫైర్



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో పరాజయంపాలైన తృణమూల్ కాంగ్రెస్‌లో తీవ్ర సంక్షోభం నెలకొంది. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు తిరుగుబావుటా ఎగరవేయగా.. తాజాగా ఆ పార్టీ సీనియర్ నేత కకోలీ ఘోష్ సారథ్యంలో దాదాపు 20 మంది లోక్‌సభ ఎంపీలు ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించడం సంచలనం సృష్టించింది. ఈ పరిణామంపై తృణమూల్‌కు చెందిన మరో ఎంపీ మహువా మొయిత్రా స్పందించారు. రెబల్ ఎంపీలపై ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ''ఎంపీలు 2024 ఎన్నికల్లో టీఎంసీ టిక్కెట్‌పై గెలిచారు. ప్రజా తీర్పు ఎన్డీయేకు అనుకూలంగా ఇవ్వలేదు. వీరందరూ తమ పదవులకు రాజీనామా చేసి.. భాజపా టికెట్ పై పోటీ చేయండి. మీరు ఎంతటి గొప్ప వీరులో చూద్దాం'' అని సవాల్ చేశారు. అలాగే, మరో ఎంపీ, మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్‌ను ఉద్దేశిస్తూ మహువా మరో పోస్టు పెట్టారు. ''యూసఫ్ పఠాన్ గారూ.. అమిత్ షా మిమ్మల్ని పిలిచినందుకే మీరు దిల్లీకి వెళ్తున్నారా? కొంతైనా ధైర్యం ఉండాలి. మీరు టీమ్ ఇండియా తరఫున ఆడారు'' అని పేర్కొన్నారు. అయితే, యూసఫ్ పఠాన్ తిరుగుబాటు చేసిన ఎంపీల గ్రూపులో ఉన్నారా లేదా అనే విషయంలో మాత్రం ఇప్పటివరకు స్పష్టత రాలేదు.

## మమతకు వరుస షాక్‌లు..
# ఎన్డీయేకు 20మంది లోక్‌సభ టీఎంసీ ఎంపీల మద్దతు



పశ్చిమ బెంగాల్‌లో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌లో తీవ్ర సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో లోక్‌సభలోని 20మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎంపీ కకోలీ ఘోష్ నేతృత్వంలో రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ సమర్పించారు. లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్‌గా తాను.. తోటి ఎంపీలతో సంప్రదింపుల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఘోష్ తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ.. వారు ఎన్నుకున్న ప్రభుత్వంతోనే కలిసి పని చేయాలని తమ బృందం నిర్ణయించుకుందని ఆమె పేర్కొన్నారు. ఈ అంశంపై టీఎంసీ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ చీలికతో లోక్‌సభలో మమతాబెనర్జీ సారథ్యంలోని తృణమూల్‌కు కేవలం ఎనిమిదిమంది సభ్యులే మిగిలారు. బెంగాల్ శాసనసభలో ఇప్పటికే టీఎంసీ ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా చీలిపోయారు. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని 58 మందికి పైగా తిరుగుబాటు ఎమ్మెల్యేల బృందం తామే నిజమైన తృణమూల్ వర్గం అని ప్రకటించుకుంది. టీఎంసీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ అయిన సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు.



## ఉజ్వల లబ్ధిదారులకు రాయితీ సిలిండర్లలో కోత

దిల్లీ: ఉజ్వల పథకం కింద ఇస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం కుదించింది. ఏడాదికి నాలుగు సిలిండర్లకే పరిమితం చేసింది. పేదలకు ఉచితంగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు ఇచ్చే ఉద్దేశంతో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకాన్ని (PMUY) 2016లో తీసుకొచ్చారు. ఈ పథకంలో భాగంగా తొలుత ఏడాదికి 12 గ్యాస్ సిలిండర్లను సబ్సిడీపై అందించేవారు. గతేడాది ఈ సంఖ్యను 9కి తగ్గించారు. తాజాగా దాన్ని నాలుగుకు పరిమితం చేశారు. కుటుంబ సగటు వినియోగానికి అనుగుణంగా ఈ మార్పు చేసినట్లు పెట్రోలియం శాఖ అదనపు శాఖ కార్యదర్శి ప్రవీణ్ మల్ ఖనూజ్ వెల్లడించారు. గతంలో ఏడాదికి 12 సిలిండర్ల వరకు ఒక్కో సిలిండర్‌కు రూ.200 చొప్పున బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసేదన్నారు. 2023లో సబ్సిడీ మొత్తాన్ని రూ.300కు పెంచామని చెప్పారు. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలోనే ఎల్‌పీజీ సిలిండర్ ధర తక్కువని ప్రవీణ్ తెలిపారు. ఆయిల్ కంపెనీలు ఒక్కో సిలిండర్‌కు రూ.700 చొప్పున భారాన్ని భరిస్తున్నాయని పేర్కొన్నారు. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఎల్‌పీజీ ధరలూ పెరుగుతున్నాయి. గడిచిన మూడు నెలల్లో రెండు దఫాల్లో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.89 పెరిగింది. దీంతో దిల్లీలో ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.942కి చేరింది. అయితే, రాయితీ అనంతరం ఉజ్వల వినియోగదారులకు రూ.642కే గ్యాస్ సిలిండర్ లభిస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇకపై నాలుగు సిలిండర్‌లకు రూ.300 చొప్పున ఏడాదికి కేవలం రూ.1200 మాత్రమే సబ్సిడీ లభించనుంది.

## 15ఏళ్ల వయసులో ఇంటిని వీడి..
# 45ఏళ్ల తర్వాత తల్లి గడపకు చేరి..



ఉత్తరాఖండ్‌లో అరుదైన ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల వయసులో ఇంటిని వీడిన కుమారుడు 45 ఏళ్ల తర్వాత తిరిగి రావడంతో ఆ తల్లి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. అసలేమయ్యిందంటే..? ఉత్తరాఖండ్‌లోని బెరినాగ్ వద్ద దౌలిగడ్ గ్రామంలోని నంది దేవి అనే వృద్ధురాలి ఇంటికి ఓ సాధువు భిక్ష కోసం వచ్చాడు. అతడిని తేరిపారా చూసిన ఆమె భిక్ష కోసం ఇంటి ముందుకువచ్చిన ఆ సాధువు 15 ఏళ్ల వయసులో తప్పిపోయిన తన కుమారుడు బుధి బల్లభ్ ఉపాధ్యాయ అని గుర్తించింది. దాదాపు ఐదు దశాబ్దాల నిరీక్షణ తర్వాత తన కుమారుడిని చూడడంతో ఆమె భావోద్వేగానికి గురైంది. అతడు తప్పిపోయిన తర్వాత ఏళ్ల పాటు వెతికినా ఎటువంటి ఆచూకీ లభించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తాను మొదట ఇతర రాష్ట్రాలకు ట్రక్కులు రవాణా చేసే వారితో కలిసి పనిచేశానని.. క్రమంగా దేవాలయాలు, ఆధ్యాత్మిక అన్వేషణల దిశగా వెళ్లినట్టు బుధిబల్లభ్ ఉపాధ్యాయ గ్రామస్థులకు చెప్పాడు. అనంతరం రాజస్థాన్‌లోని ఓ ఆలయంలో సాధువుగా ఉంటున్నట్లు తెలిపాడు. సన్యాసం తీసుకొనే ముందు తల్లి నుంచి భిక్ష స్వీకరించాలని తన ఆధ్యాత్మిక గురువు సూచించారని.. ఆయన ఆదేశానుసారమే భిక్ష స్వీకరించడానికి ఇంటికి వచ్చానని తెలిపాడు. ఇన్నేళ్ల తర్వాత తన తల్లిని కలుసుకోవడం సంతోషంగా ఉందని.. భిక్ష స్వీకరించిన అనంతరం తిరిగి రాజస్థాన్‌కు వెళ్లిపోతానని పేర్కొన్నాడు.

# కలహాలొద్దు.. కలిసి సాగుదాం: ఇండియా కూటమి




దిల్లీలో విపక్ష ఇండియా కూటమి నేతలు సమావేశమై ఏకగ్రీవంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అంతర్గత కలహాలను పక్కన పెట్టి భాజపాకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యలపై కలిసి పనిచేయాలని నిర్ణయించారు. మిత్రపక్షాలు ఒకరినొకరు విమర్శించుకోకుండా, ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

*** ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే..**

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, సీబీఎస్ఈ వ్యవహారం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయాలని నేతలంతా ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓట్ల దోపిడీ అంశంపై సీజేఐకి లేఖ రాయాలని కూడా ఈ భేటీలో చర్చించి నిర్ణయించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల ప్రజా సమస్యలతో పాటు దేశంలోని అనిశ్చిత ఆర్థిక పరిస్థితులపైనా చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.

**తదుపరి భేటీ హైదరాబాద్‌లో..**


రాబోయే వర్షాకాల సమావేశాల నేపథ్యంలో పార్లమెంటులో విపక్షాలన్నీ ఏకతాటిపై ఉండాలని, ప్రజాసమస్యలపై కలిసి పోరాడాలని నేతలు నిర్ణయించారు. అలాగే, ప్రతి రెండు నెలలకోసారి సమావేశమై విపక్షాల ఐక్యతను చాటాలని నిర్ణయించిన నేతలు.. ఇండియా కూటమి తదుపరి సమావేశాన్ని ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో 22 విపక్ష పార్టీల నేతలతో పాటు స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్ పాల్గొన్నారు. తొలుత 25 పార్టీలు ఈ సమావేశానికి హాజరవుతాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పినప్పటికీ.. డీఎంకే హాజరు కాలేదు. ఆప్ సైతం ఈ కూటమికి దూరంగా ఉంటామని ఇప్పటికే ప్రకటించింది. టీవీకే హాజరయ్యే అవకాశం ఉందంటూ ప్రచారం జరిగినప్పటికీ.. ఆ పార్టీ కూడా ఈ సమావేశానికి హాజరు కాలేదు.

# మమతకు మరో ఎదురుదెబ్బ.. పార్టీని వీడిన సీనియర్ ఎంపీ



టీఎంసీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు. పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు భాజపాపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు. అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు కూడా టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సుఖేందు తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరో ఎంపీ కోయల్ మల్లిక్ కూడా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరో 14మంది టీఎంసీ ఎంపీలు బెంగాల్ సీఎం సువేందు అధికారిని కలిసినట్లు మీడియా వర్గాలు వెల్లడించాయి. వారు భాజపాలో చేరనున్నట్లు తెలుస్తోంది.

# పశ్చిమాసియాలో మళ్లీ దాడులు.. స్పందించిన భారత్



ఇరాన్ ఇజ్రాయెల్ పరస్పర దాడులతో పశ్చిమాసియా మరోసారి భగ్గుమంది. ఈ పరిణామాలపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే ఉద్రిక్తతలను తగ్గించుకుని, శాంతియుత పరిష్కారం కోసం ప్రయత్నించాలని కోరింది. ''పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు నెలకొనడం విచారకరం. ఈ పరిణామాలు అంతర్జాతీయ సమాజానికి అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయి. 100 రోజులకు పైగా కొనసాగుతోన్న ఈ ఘర్షణల కారణంగా ఇప్పటికే భారీ నష్టం వాటిల్లింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన సరఫరాలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఉద్రిక్తతలను తక్షణమే ముగించాలని, పౌరులకు ఎలాంటి హాని కలగకుండా చూడాలని అన్ని పక్షాలను కోరుతున్నాం. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం లభించే దౌత్య పరిష్కారాల కోసం జరుగుతున్న చర్చలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి'' అని భారత విదేశాంగ శాఖ పిలుపునిచ్చింది.

**కాల్పులు ఆపండి: ట్రంప్**

మరోవైపు, తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్, ఇజ్రాయెల్ తక్షణమే పరస్పరం కాల్పులు ఆపాలని తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ ఆదివారం అర్ధరాత్రి నుంచి దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది. ఇరాన్ కీలక మౌలిక సదుపాయాలు, చమురు ప్లాంట్లను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుపుతోంది. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ భీకర పరిస్థితులు నెలకొన్నాయి.

# సినిమా

## KAJAL AGGARWAL

# ఆ విషయంలో తేడాలెందుకు?



హీరోలు, హీరోయిన్ల రెమ్యూనరేషన్‌లో తేడాలపై కాజల్ అగర్వాల్ సంచలన కామెంట్స్ చేసింది. ఆస్కార్ లెవెల్‌కు ఇండియన్ సినిమా చేరుకున్నా రెమ్యూనరేషన్‌లో గ్యాప్ మాత్రం అలాగే ఉందని అన్నది. ఇండియన్ సినిమా ఇంటర్నేషనల్ లెవెల్‌కు ఎదిగింది. హాలీవుడ్ కంటే మన సినిమాలు ఎందులోనూ తక్కువ కాదని చాలా మంది దర్శకులు నిరూపిస్తున్నారు. బాలీవుడ్ కంటే సౌత్ ఇండస్ట్రీ చాలా బెటర్. అయినా రెమ్యూనరేషన్ విషయంలో వివక్ష కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ హీరోలతో పోలిస్తే హీరోయిన్లకు రెమ్యూనరేషన్లు చాలా తక్కువగానే ఉంటున్నాయి. ఈ తేడాలపై చాలా మంది స్టార్స్ సైలెంట్‌గానే ఉండటం బాధ కలిగిస్తుంది. అని కాజల్ అన్నది. కాగా ప్రస్తుతం బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమాలో హీరోయిన్‌గా కాజల్ నటిస్తోంది.

## RASHMIKA MANDANNA



# సింగర్ బయోపిక్‌లో నేషనల్ క్రష్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న తెలుగులో ఫస్ట్ టైమ్ ఓ బయోపిక్ మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. లెజెండరీ సింగర్ పాత్రలో కనిపించనున్నట్లు చెబుతోన్నారు. దిగ్గజ కర్ణాటక సంగీత కళాకారిణి ఎం.ఎస్ సుబ్బులక్ష్మి జీవితం ఆధారంగా తెలుగులో ఓ మూవీ రాబోతుంది. ఈ బయోపిక్‌లో మొదట సాయిపల్లవిని అనుకున్నప్పటికీ చివరకి నేషనల్ క్రష్‌ను ఫైనల్ చేశారట. ఆమెపై లుక్ టెస్ట్ కూడా నిర్వహించారట. అచ్చం సుబ్బులక్ష్మిని పోలినట్లుగా రష్మిక కనిపిస్తోన్న ఓ ఫొటో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. సామాన్యురాలిగా జీవితాన్ని మొదలుపెట్టి దేశం గర్వించే సంగీత కళాకారిణిగా సుబ్బులక్ష్మి సాగించిన ప్రయాణం నేపథ్యంలో ఈ సినిమా సాగనుందట. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో బన్నీవాసు నిర్మించబోతున్నారు. తెలుగు, హిందీతో పాటు ఇతర దక్షిణాది భాషల్లో ఈ మూవీ రిలీజ్ కాబోతుంది.



# లోకేష్ కనగరాజ్ మూవీలో.

మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి తన నిర్మాణ సంస్థ జీ స్క్వాడ్ బ్యానర్‌లో లోకేష్ కనగరాజ్ ఓ లేడీ ఓరియెంటెడ్ మూవీ నిర్మించబోతున్నాడట. తెలుగు, తమిళ భాషల్లో బైలింగ్వల్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీలో రెజీనా హీరోయిన్‌గా నటించనున్నట్లు సమాచారం. ఆమెతో పాటు టాలీవుడ్, కోలీవుడ్‌కు చెందిన పలువురు యాక్టర్లు ఇందులో కీలక పాత్రల్లో కనిపించనున్నారట. విశాల్ వెంకట్ దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. ఈ ఫీమేల్ సెంట్రిక్ మూవీకి లోకేష్ కనగరాజ్ కథను అందించడమే కాకుండా ఇందులో ఓ గెస్ట్ రోల్‌లో కూడా కనిపించే అవకాశం ఉందని అంటున్నారు.

# వాఘా బోర్డర్‌లో రెహమాన్‌షో..

ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ వాఘా – అట్టారి బోర్డర్ వద్ద లైవ్ మ్యూజికల్ పర్ఫార్మెన్స్ ఇచ్చారు. దేశ రక్షణలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బంది త్యాగాలకు నివాళిగా ఈ మ్యూజిక్ కాన్సెర్ట్‌ను నిర్వహించారు. ఈ లైవ్ షోలో పలు దేశభక్తి పాటలు ఆలపించి ఆహుతులను అలరించారు. బాలీవుడ్ మూవీ మై వాపస్ ఆవూంగా ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఆర్ రెహమాన్, సింగర్ మోహిత్ చౌహన్, డైరెక్టర్ ఇంతియాజ్ అలీతో పాటు బాలీవుడ్ హీరో వేదాంగ్ రైనా పాల్గొన్నారు. ఈ షోకు భారీ సంఖ్యలో ప్రేక్షకులతో పాటు జవాన్లు అటెండయ్యారు.వాఘా బోర్డర్‌లో లైవ్ మ్యూజికల్ పర్ఫార్మెన్స్ నిర్వహించిన తొలి మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఘనతను సాధించారు.







# భారత్‌దే ఏకైక టెస్టు

- ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో అఫ్గాన్‌పై జయభేరి

ముల్లాన్‌పూర్‌లో జరిగిన ఏకైక టెస్టులో అఫ్గానిస్థాన్‌పై భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 8 వికెట్ల నష్టానికి 564 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకే పరిమితమై ఫాలోఆన్ ఆడిన అఫ్గాన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ 112 పరుగులకే తోక ముడిచింది. ఈ మ్యాచ్‌లో భారత్ తరపున అరంగేట్రం చేసిన స్పిన్నర్ మానవ్ సుతార్ ఏడు వికెట్లు సాధించాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.